పితృదేవోభవ

గోవిందరాజు రామకృష్ణారావు

స్కూటర్ బయటే స్టాండు వేసి ఇంట్లోకి దూసుకు వస్తూ 'వసూ . వసూ' అంటూ కేక పెట్టినట్లు పిలిచాడు జానకిరాం బూట్లన్నా విప్పకుండా వంటింటి గడప దగ్గరకెళ్లి 'ఇంకా తెమల్లేదా నువ్వు . చా . ఎంత చెప్పినా నీకు చెవికెక్కదు అవతల ఫ్రెండ్స్ ఫ్యామిలీస్‌తో వచ్చి ముందుగానే మేనేజర్ని కలుస్తారు హాలుదగ్గర. వాడి కూతురు అరంగేట్రం అని పొద్దునే చెప్పాగా వాడసలే తిక్క వెధవ. ఇలాంటి ఫార్మాలిటీస్ అంటే పడి చస్తాడు' గుక్క తిప్పుకోకుండా చెబుతున్నాడు

పుల్కాల కోసం తడిపి ముద్ద చేస్తున్న గోధుమపిండి వంక చూస్తూ 'ఎందుకలా అరుస్తారు నాకేం చెవుడులేదు.' వసుధ పుల్ల విరుపుగా అంది పీటపైన ముద్దను గట్టిగా కొడుతూ

'అంటే నీ ఉద్దేశం' కోపంగా అడిగాడు

'కనిపించటంలా! నేను వూరికే కూచోలా పుల్కాలు ఎవరు చేస్తారు' చిరాకుపడింది

జానకిరాంకి వెంటనే జవాబు తోచలేదు. వెళ్లి బూట్లు విప్పి మూలపడేశాడు. టవల్ తీసుకుని వాష్ బేసిన్ వైపు వెళ్తూ 'ఆ పని ఆపెయ్' కసిరాడు

'డోంట్ బి సిల్లీ'. సీరియస్‌గానే చెప్పింది

జానకిరాం షాక్ తిన్నాడు

'మీకేం మగమహారాజు ఆయనగారికి అన్ని అమర్చాలా వద్దా' నిలదీసినట్లడిగింది.

కోపం నసాలానికి పాకింది వంటింట్లోకి వెళ్లి స్టౌ ఆర్పేసి వసుధని చెయ్యి పుచ్చుకుని ఇవతలికి లాక్కొచ్చాడు హఠాత్సంఘటనకి ఆశ్చర్యపడింది వసుధ.

'మీకు మతిపోయిందా?'

'అవును . గేట్ రెడి ఇన్ టెన్ మినిట్స్' ఆజ్ఞాపించాడు

పరిస్థితి గ్రహించింది.

'ఆయనగారికి రాత్రి భోజనం?' తమాయించుకుని అడిగింది.

'మళ్లీ వచ్చాక చూద్దాం. ఒక్క పూటకి ప్రమాదం ముంచుకురాదు' తేలికగా సమస్య పరిష్కరించాననుకున్నాడు

'మీకేం అనేశారు నిందపడేది నేను' నిష్ఠూరంగా అంది.

'నిందాలేదు - బొందా లేదు. ఇలా అమర్చి అన్నీ చేస్తుంటే ముసలాయన ఇక్కడే తిష్ఠ వేస్తాడు. ఇప్పటికే మూడు వారాలయింది కిందటి వారమే తమ్ముడు దగ్గరికి వెళ్లిపోతాడనుకున్నాను.'

'ఇవ్వాళేదో వుత్తరం వొచ్చిందాయనకి'

'నాకవన్నీ తెలియవు. ఒకటి రెండు రోజులు చూసి నేనే చెబుతా .' చిరాకుగా అన్నాడు.

'ఏవని చెబుతారు?' రెట్టించింది.

'తమ్ముడు దగ్గరికి పొమ్మని మాట ప్రకారం వుండాలి లేకపోతే ఏమిటి. న్యూసెన్సు. నాకు మాట తప్పితే చిర్రెత్తుకొస్తుంది' జానకిరాం కంఠం మళ్లీ స్థాయి పెంచుకుంది.

'ఎందుకలా ఇదవుతారు ... ఆయన షికారుకెళ్లి తిరిగొచ్చే టైమయింది' హెచ్చరించింది.

'వస్తే రాని . నాకేం భయమా స్పష్టంగా చెప్పేస్తా '

'చాల్లెండి ఈ వాదనెందుకు'

'వాదనకాదు జరిగేదే అంత. నువ్వు త్వరగా చీర మార్చుకు బయలుదేరు.'

'కొంచెం కాఫీ కలిపిస్తా'

'అక్కర్లేదు. ఆఫీసులో ఫ్రెండ్స్‌తో ఇప్పుడే తీసుకున్నా .. కమాన్ గెట్ రెడి. క్విక్'

నలతగా వుండి షికారు కెళ్ళలేక మూలగదిలో మంచంమీద పడుకుండి పోయిన రామ్మూర్తి తన చెవుల్ని తాను నమ్మలేకపోయాడు. ఆ వయస్సులో మరొకరికయితే ఆ మాటలు విన్న మీదట మెదడు నరాలు చిట్లిపోయేవి

రామ్మూర్తి తత్వం వేరు జీవితం అంటే సాకల్యంగా తెలిసినవాడు. లోకంపోకడ గ్రహించినవాడు. అందుకనే ఉద్రేకపడలేదు.

ఆపుకోవాలని ఎంత ప్రయత్నించినా దగ్గు తెర ఆగలేదు గట్టిగా దగ్గుతూ వరండాలోకి వచ్చాడు' బయట వుమ్మివేయడానికి.

అప్పటికి రెడి అయిన జానకిరాం తండ్రి షికారు నుంచి తిరిగి వచ్చాడనుకున్నాడు.

వరండాలోకి వచ్చి, మేం డాన్సు ప్రోగ్రాంకి వెళుతున్నాం. వచ్చేటప్పటికి తొమ్మిది దాటుతుంది.'

'ఫర్వాలేదురా. ఈ పూట ఎందుకో ఆకలిగా లేదు. రెండు అరటిపళ్లున్నాయ్ తిని పడుకుంటాను.'

'నీ యిష్టం'

ఇంతలో సుధ కూడా వచ్చింది.

ఇద్దరూ స్కూటర్‌పైన వెళ్లిపోయారు.

రామ్మూర్తి వాలు కుర్చీ తెచ్చుకుని వరండాలో వేసుకున్నాడు. కూర్చుని వీధి వెంట వెళ్లేవాళ్ళని యాంత్రికంగా చూస్తున్నాడు.

గతం అంతా నెమరువేసుకుంటూ కుంగి కృశించడం రామ్మూర్తి నైజానికి సరిపడదు. పద్ధతి ప్రకారం బ్రతుకు సాగించడం అలవాటు. ముప్పై అయిదేళ్ళు తనని కంటికి రెప్పలా చూసుకున్న ఇల్లాలు పార్వతి హఠాత్తుగా కన్నుమూసి తనని ఒంటరి చేసి హాయిగా తృప్తిగా పసుపుకుంకమలతో ఏణ్ణార్ధం క్రితం వెళ్లిపోయినప్పుడు కూడా పైకి నిబ్బరం సడలలేదు. గుండెల్లో సముద్రాలు పొంగినా ఆ వురవడిలో కొట్టుకుపోలేదు.

భవిష్యత్తు కీకారణ్యంలా తోచింది. అయినా దారి వెతుక్కోక తప్పదని తెలుసు. ఇద్దరు కొడుకులు ఆలోచించుకుని చెప్పారు. రెండు వారాలు ఒకరింట్లో, మరో రెండు వారాలు ఇంకొకరింట్లో వుండేటట్లు నిర్ణయించారు సరేనన్నాడు

ఈ పదిహేను మాసాలుగా కొడుకులూ కోడళ్ళూ ప్రవర్తిస్తున్న తీరు గమనించకపోలేదు జాగ్రత్తపడాలని కూడా గ్రహించాడు. కాని యివాళ తాను చెవులార విన్న మాటలు ముందు జీవితం గురించి తీవ్రంగా ఆలోచింపచేసేవిగా వున్నాయి.

క్రిందటిసారి రెండో కొడుకు దగ్గర వున్నప్పుడు' నీకేవయ్యా రామ్మూర్తీ! అదృష్టవంతుడివి రామలక్ష్మణుల్లాంటి కొడుకులు. రెండు కళ్ళు. త్వరలో నీకు బ్రహ్మాండంగా షష్టిపూర్తి మహోత్సవం జరుపుతారయ్యా' అని స్నేహితుడన్న మాటలు గుర్తొచ్చి లోలోన నవ్వుకున్నాడు

మధ్యాహ్నం రెండో కొడుకు రాసిన ఉత్తరం చదివినప్పటి నుంచి దానిని పెద్దవాడికి చూపాలా వద్దా అని ఆలోచిస్తున్నాడు జానకిరాం రాక ముందు. ఆ సమస్య తీరిపోయింది. ఇక ఆ వుత్తరంలోని సంగతులు ఎవరికీ చెప్పనవసరంలేదు

తానే మరోసారి చూద్దామనుకున్నాడు లేచి వెళ్లి తీసుకొచ్చాడు కళ్ళు చదువుతున్నాయి:

'పూజ్యులైన నాన్నగారికి,

నమస్కారాలు.

క్రిందటి వారం ఇల్లు మారాం. ఇప్పుడున్న యిల్లు ఆఫీసుకి కొంత దగ్గరగా వుంది వెనకటి యింటాయన అద్దె పెంచమని గోల చేస్తున్నాడు. పైగా నీళ్ళు సరిగా రావడంలేదు. కొత్త యింట్లో నీళ్ళ యిబ్బందిలేదు కాని యిల్లు చాలా చిన్నది చుట్టుపక్కల వున్న వాళ్ళు మంచివాళ్లే మీ కోడలు రాధకి నచ్చింది. ఇద్దరు పిల్లల బడికి కూడా దగ్గరవుతుంది

అన్నయ్యకి తర్వాత విడిగా ఉత్తరం రాద్దామనుకుంటున్నాను. రాధకి ఈ మధ్య ఒంట్లో అంత బాగా వుండడంలేదు. పిల్లలతో సతమతమవుతోంది. డాక్టరుకి చూపించాను. మందులు రాసిచ్చి విశ్రాంతి తీసుకోవాలన్నాడు ఈ వివరాలన్నీ అన్నయ్యకి నెమ్మది మీద రాస్తాను.

ఊళ్లో ఇంటి సగం వాటా అద్దె నాకు సరిగా

పంపడంలేదు. అన్నయ్యవాటా అద్దె నెల నెలా పంపుతున్నారనుకుంటున్నాను. మీరు ఒకసారి అద్దెకున్నాయనకి గట్టిగా ఉత్తరం రాయండి. అన్ని ధరలు పెరిగిపోవడంతో డబ్బుకి యిబ్బందిగా వుంది.

ఇప్పుడు మీరిక్కడికి వస్తే ముఖ్యంగా చిన్న యిల్లు కాబట్టి యిబ్బందిగా వుంటుంది. అక్కడున్న యిల్లు పెద్దది. మీ కోసం విడిగా ఒక గది ఏర్పాటు చేశారుగదా! కాబట్టి తిరిగి ఇక్కడ పరిస్థితి అనుకూలం అయ్యేవరకూ మీరు అక్కడే వుండడం మంచిది. ఈ సంగతి అన్నయ్యకు రాస్తాను. అక్కడ బాదరబందీ లేదు. రఘు పబ్లిక్ స్కూల్లోనే వుంటున్నాడు. కనుక ఒదినకి పని తక్కువ. అందుచేత ప్రస్తుతం మీరు అక్కడే వుండండి. అన్నయ్యకీ ఒదినకీ నమస్కారాలని చెప్పండి.

ఇట్లు మీ

చిన్నా.

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నాడు. పకడ్బందీగా రాసినందుకు కొడుకు ప్రయోజకత్వాన్ని మెచ్చుకున్నాడు. దాని ప్రభావం ఎటువంటిదో వూహించేందుకు రామ్మూర్తికి ఎక్కువసేపు పట్టలేదు.

ఇక చేయవలసిందేమిటి?

జీవితంలో ఇంతవరకు ఎవర్నీ ప్రాధేయపడలేదు రామ్మూర్తి. ఎంత పెద్ద చిక్కు ఎదురైనా నిభాయించుకుని ముందుకుపోవడమే అతనెరుగు.

ఇప్పుడేం చేయాలి? పనులన్నీ నిర్ధారించుకోసాగాడు. చిన్నాని కోడల్నీ, మనవడూ మనవ రాల్నీ చూడాలనిపిస్తున్నా ఉత్తరం గట్టిగా మందలిస్తోంది.

పెద్దాడి కొడుకు రఘుని వెళ్ళి ఒకసారి చూసి రావాలి. దానికి యిబ్బంది ఉండదు.

ఊళ్ళో వున్న యిల్లు ఇద్దరు కొడుకుల పేరా రాసిచ్చాడు కాబట్టి గొడవలే వుండవు. చిన్నా కోరిన ప్రకారం అద్దె నెలనెలా సరిగా పంపమని రాయాలి.

రిటైరయ్యాక వచ్చిన డబ్బు కొంత ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసి మిగిలింది కొడుకులికి అప్పుడే యిచ్చేశాడు. ఆ సమస్య కూడా వుండదు. పోతే బ్యాంక్‌కి వెళ్ళి మేనేజరుతో కొన్ని విషయాలు మాట్లాడాలి. వెంటనే కాశీకి వుత్తరంరాసి పడేయాలి.

పెట్టె ఒకటి గట్టిది కొనుక్కోవాలి.

రెండు మూడు రోజుల్లో తాను వెళ్ళిపోతున్నట్లు వెంటనే పెద్దాడికి చెప్పాలి. వాడి మనస్సు కుదుటపడుతుంది. తనవల్ల ఎవరికీ యెటువంటి యిబ్బంది కలగకూడదు.

రామ్మూర్తి మనసు తేలికపడింది. మబ్బుల్లా కమ్ముకున్న సమస్యలు తొలగిపోయాయి.

కుర్చీ మడిచి గదిలో పెట్టాడు.

ఆకలిగా వుంది.

పొద్దున గూట్లో పెట్టిన అరటిపళ్ళు తిందామనుకున్నాడు. అక్కడవి లేవు.

కూజా వంచి గ్లాసు నిండా నీళ్ళు పట్టుకుని గటగటా తాగి మంచంమీద నడుం వాల్చాడు.

అనుకున్న పనులన్నీ రెండు మూడు రోజులలో పూర్తి చేయడం చాలా అవసరం. పెందరాళే లేవాలనుకున్నాడు.

* * * *

జానకిరాంకి సామాన్యంగా ఆఫీసు అడ్రసుకి ఉత్తరాలు రావు. కవరు మీద దస్తూరి తన తండ్రిదని పోల్చుకున్నాడు. కొంపతీసి మళ్ళీ వస్తున్నానని రాయడం లేదుకదా! అనే సందేహం కలిగింది. వచ్చేందుకు డబ్బు పంపమని ఇంటికి రాస్తే వసుధ ఏమనుకుంటుందోనని ఆఫీసుకి రాసి వుంటాడు.

కవరు నెమ్మదిగా చించి ఉత్తరం బయటికి తీశాడు అది రామ్మూర్తి కాశీనుంచి రాసిన ఉత్తరం:

'చిరంజీవి జానకిరాంకి-

ఆశీస్సులు.

నా నాన్నా అవున్రా. మా నాన్న పేరు పెట్టుకున్నాను గదా నీకు. పుట్టినప్పట్నుంచి నిన్నలాగే పిలుస్తున్నాను.

ఈ వుత్తరం కాశీ నుంచి రాస్తున్నందుకు ఆశ్చర్యపడుతున్నావా? మీరనుకున్నట్లు నేను చిన్నా దగ్గరికి వెళ్ళలేదు. వాడు నీకు ఉత్తరం రాసి వుండడు. నాకు రాసిన ఉత్తరంలో వాడి యిబ్బందులు చెప్పాడు. చిన్న యింట్లోకి మారారట. నేను అక్కడికి వెళ్తే యిబ్బందిగా వుంటుందని రాశాడు.

ఇక మీ సంగతి నాన్నా! అరంగేట్రానికి వెళ్ళే ముందు నువ్వూ కోడలూ వాదించుకోవడం అంతా నా చెవిని పడింది. ఓపిక లేక ఆనాడు షికారుకి వెళ్ళలేకపోయాను. మీరన్న దాంట్లో తప్పులేదు. ఎవర్నీ నిందించడంలేదు.

ఇక్కడ అన్ని ఏర్పాట్లు బాగానే ఉన్నాయి. సేవాశ్రమంలో వున్నాను. ఇదివరకే వీళ్ళకి రాసి సంగతులు తెలుసుకున్నాను.

బ్యాంక్ మేనేజరుతో అన్ని విషయాలు మాట్లాడాను. ఎఫ్. డి.పైన నెల నెలానాకు వడ్డీ ఇక్కడికే పంపుతారు. అవసరమైన పత్రాలు బ్యాంకులోనే భద్రపరిచాను. మూలగది టేబుల్లో కవరుంది. కాపీలందులో వున్నాయి.

నేను వున్నంత కాలం వడ్డీ కాశీకి పంపుతారు. ఎప్పుడు పంపడం ఆపుచేయాలో సేవాశ్రమం నుంచి కబురొస్తుంది.

అటుతర్వాత ఆ డబ్బు నీకు సగం, చిన్నాకి సగం ఇవ్వాలని కూడా బ్యాంకికి రాసిచ్చాను. డబ్బు మీ యిద్దరికీ తప్పకుండా ఇస్తారు.

నేను ఇక కాశీలోనే వుంటాను. శేష జీవితం ప్రశాంతంగా గడుపుతాను. నా గురించి నీకూ చిన్నాకీ సమస్యలుండవు. చిన్నాకి కూడా వుత్తరం రాస్తున్నాను.

చి. రఘుకి బాగా చదువు చెప్పించి గొప్పవాణ్ణి చెయ్. చి. సౌ. కోడలు వసుధకి దీవనలు.

నేనుండేది అన్నపూర్ణా సేవాశ్రమం. మణికర్ణికఘాట్‌కి రెండు ఫర్లాంగుల దూరంలో వుంది. నేను మీ అమ్మ దగ్గరికి వెళ్ళేవరకూ ఈ ఆశ్రమంలోనే వుంటాను. వెళ్ళిన సంగతి ఆశ్రమంవాళ్ళు తెలియజేస్తారు.

మీ అందరినీ మరోసారి మనసారా దీవిస్తున్నాను.

ఇట్లు

మీ నాన్న

రామ్మూర్తి. □